క్లుప్తంగా

ఎంపీడీవోగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరణ



పొన్నూరు : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా గుమ్మ చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు ఎంపీడీవోగా పనిచేసిన ఆయన బదిలీపై పొన్నూరుకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన అడిగొప్పల శ్రీనివాసరావు దుగ్గిరాల మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి బాధ్యతగా పని చేస్తానని తెలిపారు.

పెదకాకాని ఎంపీడీఓగా శ్రీనివాసరావు



పెదకాకాని: మండల నూతన ఎంపీడీఓగా శుక్రవారం రమావత్ శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాజిల్లా కొండూరు నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని తెలిపారు.

చేబ్రోలు డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకల సందడి



చేబ్రోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. 2024–25లో కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు సీనియర్స్ ఆహ్వానం పలికారు. ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దాని సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేద్దాం

వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయాన్ని అర్థం చేసుకుని రైతుల ఆర్థిక వ్యవస్థను మెరుగు పరుద్దామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ సూచించారు. శుక్రవారం గుంటూరు జిల్లా లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో ప్రకృతి వ్యవసాయంపై విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. వ్యవసాయంలో చోటుచేసుకుంటున్న మార్పులు, రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులలో పెరుగుతున్న ఆత్మహత్యలు వంటి సామాజిక సమస్యలను పరిష్కరించడానికి వ్యవసాయాన్ని పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని అయన గుర్తుచేశారు. అప్పటి కాలానికి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా హరిత విప్లవాన్ని తీసుకొచ్చారని, అయితే రైతులు అవరానికి మించి రసాయనాలను ఉపయోగించడం వల్ల వాతావరణంలో అనేక మార్పులు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ రైతు సాధికార సంస్థ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు కలసి కట్టుగా ప్రకృతి వ్యవసాయంపై పనిచేసేందుకు పరిశోధనలు, చర్చలు కొనసాగించాలని కోరారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడుల కోసం శాస్త్రవేత్తలు సూచించిన ప్రకారం కాకుండా అధిక రసాయనాలు వాడడం వల్ల ప్రజల ఆరోగ్యం, నేల ఆరోగ్యం దెబ్బతిని వాతావరణ మార్పులకు దారి తీసిందన్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి. సత్యనారాయణ, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ శ్యామ్యూల్, సీనియర్ కన్సల్టెంట్లు డి.వి. రాయుడు, ఋషి, డాక్టర్ యం. మహేశ్వరి, సీనియర్ రిసెర్చ్ కన్సల్టెంట్ కె.ఎస్. వరప్రసాద్, సీనియర్ థిమాటిక్ లీడ్‌లు గోపీచంద్, డాక్టర్ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఫుల్‌గా మద్యం కిక్కు

- నియోజకవర్గంలో పెరిగిన మద్యం షాపులు
- కొత్త పాలసీలో షాపు ఏర్పాటుకు నిర్దిష్ట ప్రదేశాన్ని సూచించని ఆబ్కారీ శాఖ
- మండల పరిధిలో ఎక్కడ వడితే అక్కడ ఏర్పాటు చేసుకునే చాన్స్
- గ్రామాల్లో రెట్టింపు కానున్న మందుబాబుల వీరంగాలు



దరఖాస్తుల కోసం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీస్ స్టేషనులో ఏర్పాటు చేసిన బాక్సులు

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లో మద్య ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తే.. కూటమి ప్రభుత్వం మాత్రం ఏరులై పారించేందుకు రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న దుకాణాల సంఖ్యను మరింత పెంచేసింది. ఎక్కడ కావాలంటే అక్కడ ఏర్పాటు చేసుకునే వీలు కల్పించింది. పర్మిట్ రూంలకు మంగళం పాడేసింది. దీంతో గ్రామాల్లో ఇక మద్యం కిక్కు ఏ రేంజ్‌లో ఎక్కబోతుందో, మందుబాబుల ఆగడాలు ఏ స్థాయిలో ఉండనున్నాయో చెప్పకనే తెలుస్తోంది.

దుకాణాలు పెంచేశారు

ప్రస్తుతం ప్రత్తిపాడులో రెండు, బోయపాలెంలో ఒకటి, పెదనందిపాడులో రెండు, జీజీపాలెంలో ఒకటి, వట్టిచెరుకూరులో మూడు, కాకుమానులో రెండు చొప్పున నియోజకవర్గంలో మొత్తం 11 మద్యం దుకాణాలున్నాయి. అయితే, కొత్త మద్యం పాలసీలో సంఖ్యను పెంచేశారు. ప్రత్తిపాడు మండలంలో నాలుగు, పెదనందిపాడు మండలంలో మూడు, కాకుమాను మండలంలో రెండు, వట్టిచెరుకూరు మండలంలో మూడు, గుంటూరు రూరల్ మండలంలోని పదకొండు గ్రామాల్లో రెండు మద్యం దుకాణాలు (మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామాలు కాకుండా) చొప్పున కొత్తగా 14 ఏర్పాటు కానున్నాయి.



ఇష్టానుసారంగా మార్చుకోవచ్చు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గానీ 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ పాలనలో గానీ మద్యం దుకాణాలు నిర్దిష్ట ప్రదేశాల్లోనే ఏర్పాటు చేయాలని అబ్కారీ అధికారులు నిర్దేశించేవారు. ఆసక్తి ఉన్న వారు కూడా ఆయా గ్రామాల పేర్లతోనే దరఖాస్తు చేసుకుని, అక్కడే దుకాణం ఏర్పాటు చేసుకునే వారు. కానీ ప్రస్తుత పాలసీలో ఎక్కడ ఏర్పాటు చేయాలన్నది నిర్దిష్టంగా నిర్ధారించలేదు. దీంతో లాటరీలో షాపును దక్కించుకున్న వారు వారికి నచ్చిన గ్రామంలో, నచ్చిన ప్రాంతంలో దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒకవేళ వారు ఏర్పాటు చేసుకున్న చోట వ్యాపారం ఆశించిన స్థాయిలో లేకుంటే, అబ్కారీ అధికారుల అనుమతి తీసుకుని వేరే ఊరికి మార్చుకోవచ్చు. ఇలా ఎన్ని సార్లు అయినా ఎక్కడ వ్యాపారం బాగా ఉంటుందనుకుంటే అక్కడకు (సంబంధిత మండలం పరిధిలో) మార్చుకోవచ్చు. అంటే ఒక రకంగా చెప్పాలంటే మొబైల్ మద్యం దుకాణాలు మాదిరి అనుకోవచ్చు. దీంతో గ్రామాల్లో కూడా 'మద్యం కిక్కు' ఎక్కడంటే అక్కడ దొరకనుంది.

మత్తులో పల్లెలు తప్పదా ?

ఇప్పటి వరకు ప్రభుత్వ దుకాణాల ద్వారా ఒక్కొక్కరికీ మూడు సీసాలను మాత్రమే విక్రయించే వారు. కానీ ఇక నుంచి ప్రైవేట్ పరం కానుండటంతో మందుబాబులకు లిమిట్ లేకుండా ఎన్ని సీసాలు కావాలంటే అన్ని విక్రయిస్తారు. దానికి తోడు పర్మిట్ రూమ్‌లకు అవకాశం లేకపోవడంతో ఇక కొనుక్కున్న చోటనో, ఖాళీ ప్రదేశాలు, నిర్మానుష్య ప్రదేశాలు, ప్రభుత్వ భవనాలు మందుబాబులకు అడ్డాలుగా మారనున్నాయి. ఇక గ్రామాల్లో తాగి తందనాలు ఆడతారు. ఇది మహిళలకు , ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగించే అంశం.

ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు



లాటరీలో షాపు దక్కించుకున్న వారు పాఠశాలలకు, దేవాలయాలు, జాతీయ రహదారులకు వంద మీటర్ల పరిధిలో కాకుండా సంబంధిత మండలం పరిధిలో ఎక్కడైనా దుకాణం ఏర్పాటు చేసుకోవచ్చు. ఏర్పాటు చేసుకున్న తర్వాత ఒకవేళ అక్కడ వ్యాపారం బాలేదనుకుంటే అధికారుల అనుమతి తీసుకుని, లైసెన్సీకి ఇష్టం వచ్చిన ఇంకొక ప్రాంతానికి దుకాణాన్ని మార్చుకోవచ్చు. ఒక దుకాణానికి ఎంతమంది ఎన్ని దరఖాస్తులు అయినా చేసుకోవచ్చు.

– కె. శ్రీనివాస్ (డెప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ)

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 22 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో మిట్టపల్లి కళాశాలల సెక్రటరీ ఎం.బి.వి. సత్యనారాయణ

ప్రత్తిపాడు: మండల పరిధిలోని తుమ్మలపాలెం మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలలో సీఎస్ఈ, ఈసీఈ, ఐటీ, ఏఐ కోర్సుల్లో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్యూ స్పైడర్స్ కంపెనీ అర్హత పరీక్షలు నిర్వహించి 22 మంది విద్యార్థుల్ని ఉద్యోగాలకు ఎంపిక చేసింది. వార్షిక వేతనం రూ. 4 లక్షల నుంచి రూ. 9.5లక్షల వరకు ఉంటుందని కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల్ని మిట్టపల్లి కళాశాలల సెక్రటరీ ఎం.బి.వి. సత్యనారాయణ అభినందించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు శాస్త్రసాంకేతిక రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. గోపీకృష్ణ, కళాశాల టీపీవో ఏవో సీహెచ్. శ్రీనివాసరావు, ఆయా శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీ ప్రొఫెసర్‌కు అవార్డు



అవార్డు పొందిన పాండురంగారావును అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: యూఎస్ఏలోని స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా అందించే 2 పర్సంట్ శాస్త్రవేత్త అవార్డు తమ కళాశాల విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కె. పాండురంగారావుకి లభించడం సంతోషంగా ఉందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాంనందున్న కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం ఎల్స్ వియర్ సహకారంతో ప్రపంచంలోని అగ్రశ్రేణి, ప్రముఖ శాస్త్రవేత్తలను సంబంధిత రంగంలో వారి ప్రభావం ఆధారంగా 2పర్సంట్ సైంటిస్ట్ అవార్డుకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ప్రచురణల సంఖ్య, జీ ఇండెక్స్, సైటేషన్ ప్రభావం వంటి అనులేఖన కొలమానాలపై ర్యాకింగ్ ఆధారపడి ఉంటుందని వివరించారు. తమ కళాశాల అధునాతన పరికరాలతో కూడిన లేబోరేటరీలు, పరిశోధనకు అవసరమయ్యే వనరుల్ని అందించడంతోపాటు విస్తృత పరిశోధనలు జరపడానికి మద్దతిస్తుందని తెలిపారు. అవార్డు పొందిన ప్రొఫెసర్ పాండురంగారావును చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు, అధ్యాపకులు అభినందించారు.

చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ అవార్డులు



అవార్డు పొందిన ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న ఆంజనేయులు

గుంటూరు రూరల్: తమ కళాశాలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన అవార్డులు రావడం సంతోషంగా ఉందని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యూఢిల్లీలో ఎడ్యుసిల్క్ ఫౌండేషన్, ఏఐసీటీఈ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్యుసిల్క్ కనెక్ట్- 2024 కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ప్రముఖ యూనివర్సిటీలు, ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు పాల్గొన్నాయని తెలిపారు. ఇందులో తమ కళాశాల ఇంజినీరింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు, సౌత్ సెంట్రల్ జోన్ నుంచి బెస్ట్ ఫెర్ఫార్మింగ్ ఇంజినీరింగ్ కళాశాలగా అవార్డును ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారాం, సౌత్ ఏషియన్ యూనివర్సిటీస్ ప్రెసిడెంట్ క్రిషన్ అగర్వాల్ చేతులమీదుగా అందుకున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన అవార్డులను పొందిన సందర్భంగా చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుజిత్‌కుమార్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు 'పసుపు' కలరింగ్

దేవదాయ శాఖ అధికారుల అత్యుత్సాహం



రోడ్డు కిరువైపులా ఏర్పాటు చేసిన పసుపు రంగు విద్యుద్దీపాలు

ప్రత్తిపాడు: దేవదాయ శాఖ అధికారులు అంతులేని 'స్వామి' భక్తిని చాటుతున్నారు. పరమ పవిత్రమైన దేవీ శరన్నవరాత్రులకు పసుపు కలరింగ్ ఇచ్చి తెలుగుదేశం పార్టీ శ్రేణులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అమ్మవారి కరుణాకటాక్షాలు తమపై ఎలా ఉన్నా.. టీడీపీ నాయకుల చల్లని దీవెనలు ఉంటే చాలు.. అనే రీతిన వ్యవహరిస్తూ విమర్శల పాలవుతున్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని శ్రీ గంగాపార్వతీ సమేత దండేశ్వరాలయం, శ్రీ వేణుగోపాల సీతారామ స్వామి దేవస్థానాలు దేవదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. ఈ రెండు ఆలయాల్లో ఏటా దసరా ఉత్సవాలను ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. అందులో భాగంగా శివాలయం నుంచి వేణుగోపాలస్వామి దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది మాత్రం కొత్తగా వచ్చిన దేవదాయశాఖ అధికారులు వివాదాస్పద పంథాను ఎంచుకున్నారు. రంగు రంగుల దీపాలకు బదులు కేవలం పసుపు రంగు కనిపించేలా విద్యుద్దీపాలంకరణను రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసి మార్గం మొత్తం పసుపుమయం చేశారు.

మానసిక ఆరోగ్యంపైనా శ్రద్ధ అవసరం



ఉత్సవాల ప్రారంభోత్సవంలో వీసీ నాగభూషణ్, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయులు తదితరులు

చేబ్రోలు: విద్యార్థులంతా మానసిక ఆరోగ్యంపైనా శ్రద్ధ తీసుకోవాలని వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్ సూచించారు. యూనివర్సిటీలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న వరల్డ్ మెంటల్ హెల్త్ డే ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. బ్రోచర్‌ను వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్, డీన్లు, అధ్యాపకులు ఆవిష్కరించారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ '' థాట్ ఫెస్ట్ – ఇట్స్ టైమ్ టు టాక్ అబౌట్ మెంటల్ హెల్త్'' అనే కార్యక్రమాన్ని '' ఇట్ ఈస్ టైమ్ టు ప్రయారిటైజ్ మెంటల్ హెల్త్ ఇన్ ద వర్క్ ప్లేస్'' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారని తెలిపారు. మానసిక ఆరోగ్యం మన భావోద్వేగాలు, ఆలోచనలు, ప్రవర్తనలపై ప్రభావం చూపుతుందని చెప్పారు. విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య

ప్రత్తిపాడు: పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఐనవోలు గ్రామానికి చెందిన శివపార్వతికి ముప్పై సంవత్సరాల క్రితం గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన బిల్లా వెంకటేశ్వర్లుతో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత ఐదు సంవత్సరాలుగా శివపార్వతి మానసిక వ్యాధితో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్లో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో గత నెల 30వ తేదీ మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో బయటకు వెళ్లిపోయింది. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు ఇంటికి వచ్చి, పురుగు మందు తాగినట్లు కుమారుడికి చెప్పింది. మరలా కొద్దిసేపటికి తాగలేదని చెప్పడంతో మానసిక పరిస్థితి బాగోలేక ఒక్కోసారి ఒక్కోలా చెబుతుందని కుటుంబ సభ్యులు భావించారు. మర్నాడు శివపార్వతి అనారోగ్యానికి గురికావడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం శివపార్వతి మృతి చెందింది. భర్త వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె. నాగేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గులాబీ రంగు పురుగుపై అప్రమత్తత అవసరం

శాస్త్రవేత్త ఎస్.వి.ఎస్. గోపాలస్వామి



ప్రత్తిపాడు: పత్తి పంటలో ప్రస్తుతం గులాబీ రంగు పురుగు జాడ లేనప్పటికీ పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం జిల్లా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వి.ఎస్. గోపాలస్వామి సూచించారు. పెదనందిపాడు మండలం రావిపాడులోని పత్తి, మిర్చి, మినుము పంటలను శుక్రవారం స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి శాస్త్రవేత్తలు పరిశీలించారు. ప్రస్తుతం పత్తి పంట 80–100 రోజుల దశలో కాయ తయారయ్యే స్థితిలో ఉందన్నారు. గులాబీ పురుగు ఉనికి లేనప్పటికీ రైతులు బోరాక్స్ మందును ఎకరానికి 250 గ్రాముల చొప్పున వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయడం వల్ల కాయ మంచిగా తయారవుతుందని చెప్పారు. మినుము పంటలో మారుకాయ మచ్చల పురుగు ఉధృతి అధికంగా ఉందని, నియంత్రించేందుకు ఫ్లూబెండమైడ్ (ఫేమ్) మందును 40 మి.లీ. ఎకరాకు లేదా నోవాల్యూరాన్ 200 మి.లీ. ఎకరాకు లేదా కొరాజెన్ 60 మి.లీ. ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. జీలుగను పచ్చిరొట్టగా పొలాల్లో వేసుకుంటే బీడు సమస్యలను తగ్గించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. వెంకటలక్ష్మి, ఏవో బి. సుధారాణి, గ్రామ ఉద్యాన సహాయకురాలు ఎస్‌కె. జరీనా, రైతులు పాల్గొన్నారు.

నారాకోడూరు వీఆర్వో ఆకస్మిక మృతి



చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు వీఆర్వో–2 బుల్లా సాంబశివరావు (54) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఇటీవల పెనుమాకకు బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. ఒకటి రెండు రోజుల్లో రిలీవ్ అవ్వాల్సి ఉంది. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిలో ఉన్నప్పుడు ఆకస్మాత్తుగా గుండెపోటు రావటంతో అక్కడిక్కడే మరణించారు. ఆమెకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సాంబశివరావు భౌతికకాయానికి పలువురు నివాళులు అర్పించారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి



చేబ్రోలులో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ



పెదకాకానిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద దర్నా

చేబ్రోలు: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేసి ప్రజలకు వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా లక్ష్మీ నారాయణ కోరారు. పార్టీ ఆధ్వర్యంలో చేబ్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కె. శ్రీనివాసశర్మకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు డి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్న ఉచిత ఇసుక హామీని అమలు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. చంద్రన్న బీమా అందరికీ వర్తింపచేయాలని కోరారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణంలో స్థానికులకు అవకాశాలు కల్పించాలని కోరారు. ఇసుక అందుబాటులో లేకపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి కుటుంబాలు గడవకా అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి. ఆదిశేషు, హనుమంతురావు, మస్తాన్‌వలి, చింతల శ్రీను పాల్గొన్నారు.

పెదకాకానిలో..

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక సరఫరాలో అవినీతిని అరికట్టి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై. నేతాజీ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఇసుక హామీని సక్రమంగా అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నేతాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది భవన నిర్మాణం కార్మికుల కుటుంబాలకు ఇసుక కొరత వలన జీవనం అస్తవ్యస్తమైందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, కె. సత్యనారాయణ, యు. శివయ్య, నాగేశ్వరావు, సీహెచ్. రామకృష్ణ, జెట్టి రాజ్యలక్ష్మి, బొజ్జ విజయలక్ష్మి, కె. హనుమకుమారి, ఏసుపాదం, ఎస్. సామ్రాజ్యం పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులోకి తేవాలి

ప్రత్తిపాడు: సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పెదనందిపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో కన్నా ఇసుక ధరలు ఇప్పుడు మరింత పెరిగాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

అమ్మ దర్శనం.. నయన మనోహరం



ప్రత్తిపాడు శివాలయంలో బాలాత్రిపుర సుందరీదేవిగా..



ప్రత్తిపాడు వేణుగోపాలస్వామి దేవస్థానంలో గజలక్ష్మీదేవిగా..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ప్రత్తిపాడులోని శ్రీ గంగాపార్వతీసమేత దండేశ్వరాలయం (శివాలయం)లో బాలాత్రిపుర సుందరీదేవిగా, శ్రీ వేణుగోపాల సీతారామస్వామి దేవాలయంలో గజలక్ష్మీదేవిగా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రజక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద భక్తులు పెద్దసంఖ్యలో పూజలు నిర్వహించారు. కాకుమానులోని అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో గౌరీదేవిగా, జొన్నలగడ్డలో గాయత్రీదేవిగా పూజలందుకున్నారు. చేబ్రోలులోని భీమేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవిగా, నాగేశ్వర స్వామి దేవస్థానంలో గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

–ప్రత్తిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్ , చేబ్రోలు



జొన్నలగడ్డలో గాయత్రీదేవిగా..



చేబ్రోలు భీమేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవిగా..



కాకుమానులో గౌరీదేవిగా ..